క్లుప్తంగా

ముద్రగడ నివాసంపై దాడి దారుణం

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ కన్వీనర్ గోవిందరావు



మండపేట: వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం నివాసంపై జనసేన కార్యకర్త దాడి చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ కన్వీనర్ టీవీ గోవిందరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన విజయలక్ష్మీ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో దాడులకు, హింసలకు తావులేదన్నారు. రాజకీయంగా ఎదుర్కొనలేక ముందుగా రూపొందించిన పథకంతో ఈ దాడి జరిగిందన్నారు.

భీమేశ్వరుని కల్యాణ ఏర్పాట్ల పరిశీలన



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో కల్యాణం ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ రఘువీర్

రామచంద్రపురం రూరల్: ఈ నెల 8 నుంచి జరగనున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి కల్యాణ వేడుకల భద్రతా ఏర్పాట్లపై రామచంద్రపురం డీఎస్పీ డి.రఘువీర్ సోమవారం పరిశీలించారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ సూరపురెడ్డి వెంకటేశ్వరరావు(వెంకన్నబాబు) ఆలయ ప్రాంగణంలో కల్యాణానికి స్టేజీ ఏర్పాటు చేసే ప్రాంతం, రథం ఊరేగింపు నిర్వహించే రహదారి, భక్తులు పుణ్య స్నానాలు ఆచరించే సప్త గోదావరిని డీఎస్పీకి చూపించారు. అనంతరం డీఎస్పీ రఘువీర్ రామచంద్రపురం సీఐ ఎం.వెంకటరమణ, ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్‌లకు కల్యాణం సందర్భంగా తొక్కిసలాటలు, ట్రాఫిక్ జామ్ కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని ఆదేశించారు.

అక్రమ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎస్సై లక్ష్మణ్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఉండూరులో అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ సోమవారం విలేకరులకు తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు దాడి చేయగా ఉండూరులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న అందే చక్రధర్ 38 మద్యం సీసాలతో దొరికినట్లు ఎస్సై తెలిపారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఘనంగా బల్లల పండగ



అంగరలో ఊరేగింపుగా సాగుతున్న రజక వృత్తిదారులు

కపిలేశ్వరపురం: అంగరలో సోమవారం బల్లల పండగను ఘనంగా నిర్వహించారు. రజక సామాజిక వర్గీయులు తమ వృత్తి నిర్వహణ నేపథ్యంతో బల్లల పండగను ఏటా జరుపుకుంటారు. గ్రామంలోని రజకపేట నుంచి దేవతా మూర్తులను గ్రామ వీధుల్లో ఊరేగించారు. డప్పు వాయిద్యాలతో సాగిన ఊరేగింపు రజక చెరువు వరకూ సాగింది. అక్కడ ప్రత్యేక పూజలు చేశారు.

ఎన్నికల హామీలకు చట్టబద్ధత కల్పించాలి

కాజులూరు : ఎన్నికలలో రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలు అధికారంలోకి వచ్చాక క్రమం తప్పకుండా అమలు చేసేలా ఎన్నికల కమిషన్ చట్టబద్ధత కల్పించాలని ఎంపీపీ మాతా భారతీ మురళీ అన్నారు. సోమవారం ఎంపీపీ తదితర నాయకులు మండల గ్రామాలలో పర్యటించి ఈ నెల 5న బుధవారం జిల్లా కేంద్రాలలో జరుగనున్న ఫీజు పోరును విజయంతం చెయ్యాలని కార్యకర్తలు, ప్రజలకు పిలుపు నిచ్చారు. గొల్లపాలెంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికలలో సూపర్ సిక్స్ పేరుతో తప్పుడు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తెలుగు దేశం నేతలు ఏ ఒక్కటీ అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారన్నారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో తమ నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాల పథకాలను తూచా తప్పకుండా అమలు చెయ్యటమే కాక ప్రజా సంక్షేమం కోసం ఎన్నికల్లో చెప్పని పథకాలను సైతం అమలు చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు పితాని సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు నున్న లచ్చన్న, వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యా.. ఆరోగ్య ప్రదాతా..

- రథసప్తమి పూజలకు సర్వం సిద్ధం
- ఆరోగ్య, ఆధ్యాత్మికతల సమ్మేళనం
- వెదురుపాక విజయదుర్గా పీఠంలో ప్రత్యేక పూజలు
- జి.మామిడాడలో నేడు సూర్యనారాయణ స్వామి రథోత్సవం
- పుణ్య స్నానాలకు సిద్ధమైన కపిలేశ్వరపురం, కోరుమిల్లి, తాతపూడి పుష్కర ఘాట్లు



కపిలేశ్వరపురంలో సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు (ఫైల్)


కపిలేశ్వరపురం: భారతీయ సనాతన సంప్రదాయంలో ప్రతి వేడుక, పండగ వెనుక శాస్త్రీయ ఆధారాలు ఉంటాయి. తరాలుగా వారసత్వంగా వస్తున్న అనేక సంప్రదాయాలు మానవుని ఆరోగ్యాన్ని కాపాడుతూ వస్తున్నాయి. ఆహారంతో పాటు ప్రాకృతిక ప్రపంచం మనిషి జీవనం, ఆయుష్షును నిర్ధారిస్తాయి. అలా ఆధ్యాత్మికం, ఆరోగ్యం కలగలుపు పండగగా రథ సప్తమిని జరుపుకోవడం విశేషం. ఈ పండగ సందర్భంగా ప్రత్యేక కథనం..

ప్రయోజనాలెన్నో..

సూర్య భగవానుడి జన్మతిథి మాఘ శుద్ధ సప్తమిని పురస్కరించుకుని భక్తులు రథ సప్తమిని జరుపుకుంటారు. వైష్ణవాలయాలతో పాటు ప్రతి ఇంటిలో భాస్కరుడి పూజలతో తరిస్తారు. చిక్కుడు కాయలు, కొబ్బరి ఈనెలతో తయారు చేసిన రథానికి, చిక్కుడు ఆకులు, రేగు పండ్లు, జిల్లేడు పూలతో అలంకరించి పూజిస్తారు. ఆవు పిడకలతో ఏర్పాటు చేసిన దాలిపై ఆవుపాలు పొంగించి తయారు చేసిన క్షీరాన్నంతో పాటు చెరకు, తెల్ల దుంపలను భాస్కరునికి నైవేద్యంగా సమర్పిస్తారు. మహిళలు ఉదయాన్నే రేగుపళ్లు, జిల్లేడు ఆకులు శిరస్సుపై ధరించి పుణ్యస్నానాలు ఆచరిస్తారు. తెల్లవారుజామున భక్తులు సూర్య నమస్కారాలు చేస్తారు. ప్రముఖ ఆలయాల్లో అదే రోజు సూర్యప్రభ వాహనం, చిన్నశేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, సర్వ భూపాల, చంద్రప్రభ వాహనాలపై స్వామిని ఊరేగించి మధ్యాహ్నం స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తారు. ఈ ప్రక్రియలో విశ్వంలోని అనేక శాస్త్రీయ అంశాలు దర్శనమిస్తాయి.

రెండు నియోజకవర్గాల్లో ఇలా..

రథసప్తమి రోజున పుణ్య గౌతమీ గోదావరి తీర ప్రాంతాలైన కపిలేశ్వరపురం, కోరుమిల్లి, తాతపూడి పుష్కర ఘాట్లు మహిళలతో కిటకిటలాడతాయి. ఇతర గ్రామాల్లో వైష్ణవాలయాలను భక్తులు సందర్శిస్తారు. రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠంలో అరుణహోమం, సూర్య నమస్కారాలను ప్రదర్శిస్తారు. సామూహిక కుంకుమ పూజలు చేస్తారు. ఏడిదలోని సంఘమేశ్వర క్షేత్రంలో సూర్యనారాయణస్వామికి పంచామృతం, మందాల పువ్వులతో పూజలు చేస్తారు. రెండు నియోజకవర్గాల సమీపాన గల పెదపూడి మండలం జి.మామిడాడలో ఏటా నిర్వహించే శ్రీ సూర్యనారాయణ స్వామి రథోత్సవానికి ఇక్కడి భక్తులు తరలి వెళతారు.



సూర్య నమస్కారాల నమూనా చిత్రం

ఆరోగ్య సిద్ధి..

సూర్య నమస్కారాల్లోని పదకొండు ఆసనాల్లో ఆరోగ్య, ఆధ్యాత్మిక అంశాలు ఒదిగి ఉంటాయి. వాటిని చేయడం ద్వారా కదలికలు ఏర్పడి శరీరావయవాల్లోని భాగాలకు రక్త ప్రసరణ వృద్ధి చెందుతుంది.

దివ్యాసనాలు ఇవిగో..

- ప్రణామాసనం వేయడం ద్వారా ఏకాగ్రత వృద్ధి చెందుతుంది.
- హస్త ఉత్థానాసనంతో ఊపిరితిత్తులు శుభ్రమవుతాయి. అధిక బరువును తగ్గిస్తుంది.
- హస్త పాదాసనం ద్వారా ఉదర భాగంలో కొవ్వు కరుగుతుంది. జీర్ణక్రియ పనితీరు మెరుగు పడుతుంది.
- ఏకపాద ప్రసారణాసనం ద్వారా నాడీ మండల వ్యవస్థ ఉత్తేజితం చెంది ఉదరావయవాల సామర్థ్యం పెరుగుతుంది.
- దండాసనం ద్వారా కాళ్లు, చేతులు, భుజాల కండరాలు బలిష్టంగా మారి శరీర సమతుల్యం ఏర్పడుతుంది
- అష్టాంగాసనం ద్వారా గుండె పని తీరు మెరుగుపడుతుంది.
- భుజంగాసనం వల్ల వెన్నునొప్పి,ఉబ్బసం, సెర్వికల్‌స్పాండిలైటిస్ నుంచి ఉపశమనంకలుగుతుంది.
- పర్వతాసనం ద్వారా నడుం చుట్టూ ఉండే కొవ్వు కరుగుతుంది. వీటి తర్వాత మిగిలిన నాలుగు ఆసనాలైన అశ్వ సంచలనాసనం, హస్త పాదాసనం, హస్త ఉత్థానాసనం, ప్రణామాసనాలను తిరిగి చేయాలి.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా పేరు గాంచిన ద్రాక్షారామలో వేంచేసి యున్న శ్రీ పర్వత వర్ధినీ సమేత సప్తకోటి రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. దాతలు దినేష్‌కుమార్, సంగీత దంపతుల చేతుల మీదుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో ఆంజనేయస్వామి ప్రతిష్ఠను కొమ్మిశెట్టి ఈశ్వర్, స్వరూపిణి దంపతులు, శిఖర ప్రతిష్ఠ వాసా శ్రీనివాస్, లక్ష్మీ పార్వతి దంపతుల చేతుల మీదుగా నిర్వహించారు. గణపతి పునఃప్రతిష్ఠ కొమ్మిశెట్టి వెంకట సుబ్బారావు, పద్మావతి దంపతులు, ఛండీశ్వర ప్రతిష్ఠ వీర రాఘవరెడ్డి, మణికుమారి దంపతులు చేశారు. ధ్వజస్తంభానికి మాను అందజేసిన వెంకట సత్యనారాయణ, భాను శ్రీలక్ష్మి దంపతులు, శ్రీ రాజరాజేశ్వరీ పీఠాధిపతి తాళ్ల సాంబశివరావు గురూజీ, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులు

కాజులూరు: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పదో తరగతి కీలకమని పరీక్షల్లో నూరు శాతం మార్కులు సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలని కుయ్యేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం డీడీ ప్రసన్నకుమార్ అన్నారు. నిపుణులైన ఉపాధ్యాయ బృందంతో ముద్రించిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గుర్రాల శ్రీనివాస్ కొనుగోలు చేసి శుక్రవారం75 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో నూరుశాతం ఉతీర్ణతకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నిమ్మన రాజేష్, బండి పండు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బాబోయ్ దోమలు!

- నరకం చూస్తున్న పట్టణ వాసులు
- కంటి మీద కునుకు లేకుండా అవస్థలు
- వ్యాధుల బారిన పడుతున్న చిన్నారులు
- నిర్మూలనకు చర్యలు చేపట్టడంలో యంత్రాంగం విఫలం



కలువపువ్వు సెంటర్‌లో దోమల మందు పిచికారీ చేయిస్తున్న అధికారులు

మండపేట: పట్టణంలో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. ఇక్కడ అక్కడా అని లేకుండా ఎక్కడ పడితే అక్కడ విపరీతంగా పెరిగిపోయాయి. మున్సిపల్ పరిధిలోని 30 వార్డుల్లో దోమల విజృంభణకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కలువపువ్వు సెంటర్, మెయిన్‌రోడ్డు, కేపీ రోడ్డు, వల్లూరి వారి వీధి.. ఇలా అన్ని ప్రాంతాల్లో దోమలు సంచరిస్తూ తేనెపట్టు పట్టినట్టు జనాల మీద పడి రక్తాన్ని పీల్చేస్తున్నాయి. చిన్నారులు దోమ కాటుకు వ్యాధుల బారిన పడుతున్నారు. మున్సిపల్ అధికారులు వార్డుల్లో వీటి నివారణకు నామ మాత్రపు చర్యలు చేపడుతున్నారు. ఫాగింగ్, డ్రెయిన్లలో ఆయిల్‌బాల్స్ వేసినప్పటికీ సత్ఫలితాలు ఇవ్వడం లేదనే విమర్శలు ఉన్నాయి. దోమల నివారణ చర్యలు తీసుకుంటున్నామని చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం కనిపించటం లేదు. దోమల నియంత్రణకు వాడుతున్న క్రిమి సంహారక మందు ప్రభావం చూపకపోవడంపై ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. నాసిరకం క్రిమి సంహారక మందు చల్లి చేతులు దులుపుకుంటున్నారని పలుచోట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చైర్‌పర్సన్ దుర్గారాణి, మున్సిపల్ అధికారులు స్పందించి దోమల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



కె.గంగవరం భవిత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ సలీం బాషా

కె.గంగవరం: మండలంలోని కె.గంగవరం, పామర్రు జెడ్పీ హైస్కూల్స్‌ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ డీఈఓ డాక్టర్ సలీం బాషా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పది పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. వారికి అందుతున్న సదుపాయాలను గురించి అడిగి తెలుసుకున్నారు. పదిలో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా మరింత కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మండలంలోని భవిత కేంద్రం, కె.గంగవరం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ముగిసిన సాహితీ సంబరాలు



ద్రాక్షారామలో సాహితీ సంబరాల ముగింపులో పాల్గొన్న వక్తలు

రామచంద్రపురం రూరల్: ప్రముఖ సాహితీవేత్త బీఎస్ నెహ్రూ 12వ వర్ధంతిని పురస్కరించుకుని నెహ్రూ సాహితీ సమితి ఆధ్వర్యంలో ద్రాక్షారామలో సోమవారం సాహిత్య గోష్ఠి నిర్వహించారు. ఈ సభకు ప్రముఖ కవి ఆంధ్ర కుటీరం మధునా పంతుల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెహ్రూ సాహిత్య ప్రతిభను గుర్తు చేసుకున్నారు. ఆయన చమత్కారాలను సభికులకు వినిపించారు. ప్రవచన కోకిల, తెలుగు పండితులు ఓలేటి బంగారేశ్వర శర్మ శ్రీ కృష్ణ తత్వం పై అద్భుతమైన భాగవత పద్య గానంతో సభికులకు వివరించారు. కవయిత్రి మెహర్ సుజాత నెహ్రూ రాసిన కవితలను సభికులకు గుర్తు చేశారు. అనంతరం నెహ్రూ సాహితీ సమితి గౌరవాధ్యక్షురాలు భాగవతి అంజనీదేవి, తపాల శాఖ విశ్రాంత అధికారి బీబీఎస్ తిలక్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఎంకే విశ్వనాథం తదితరుల చేతుల మీదుగా ఆర్థికంగా వెనుకబడి చదువులో ముందున్న పలువురు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి భాగవతి సుబ్బారావు గోపి, ప్రచార కన్వీనర్ పోచినపెద్ది విఠల్, తెలగాని తిలక్‌బాబు, పాపాజీ, బొడ్డు వరాలు తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



కపిలేశ్వరపురం: అంగరలోని అలమేలుమంగ, గోదాదేవీ సమేత శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి దశమ బ్రహ్మోత్సవాలను ఈ నెల 7 నుంచి 9 వరకూ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఆలయ ప్రధాన అర్చక బృందం ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కమిటీ చైర్మన్ దాసర లక్ష్మణ మూర్తి, కార్యదర్శి పెద్దింశెట్టి రామస్వామి, వైస్ చైర్మన్ సూరంపూడి వెంకట్రావు, సహాయ కార్యదర్శి మోటిపల్లి వీవీ సత్యనారాయణమూర్తి, కోశాధికారి వాసా కోటేశ్వరరావు, వెల్ల శ్రీనివాస్, సంకాబత్తుల స్వామికాపు తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

రామచంద్రపురం: ఈ నెల 27న జరగనున్న ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు గన్ని కృష్ణ పిలుపు నిచ్చారు. స్థానిక లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికలపై జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు.ఈ నెల 5వ తేదీ వరకు ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉన్నందున మరిన్ని ఓట్ల నమోదుకు కృషి చేయాలని కోరారు. నియోజవర్గంలోని కూటమి నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

ప్రతి వాహనానికీ ఓ పరమార్థం

- నేటి నుంచి 13 వరకూ అంతర్వేది కల్యాణోత్సవాలు
- రోజుకో వాహనంపై స్వామి ఊరేగింపు
- పూర్తయిన ఏర్పాట్లు

సఖినేటిపల్లి: అంతర్వేది శ్రీలక్ష్మీనృసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో స్వామిని పురవీధుల్లో వివిధ వాహనాలపై ఊరేగిస్తూ గ్రామోత్సవాలను నిర్వహిస్తుంటారు. ఉత్సవాల్లో 14 రకాల వాహనాలపై స్వామికి గ్రామోత్సవం నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుందని ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ తెలిపారు. ప్రతి వాహనానికి ఓ పరమార్థం ఉన్నట్టు పురాణ సారాంశం అని అన్నారు. క్షేత్రంలో నేటి నుంచి 13వ తేదీ వరకూ నిర్వహించనున్న ఉత్సవాల్లో ఈ వాహనాలను వినియోగిస్తారన్నారు. వాహనాలు, వాటి విశిష్టతలు ఇవే..

రథసప్తమి 4వ తేదీ మొదటి రోజు

సూర్యవాహనం: తొలి రోజున సాయంత్రం స్వామి సూర్య వాహనంపై గ్రామంలో భక్తులకు దర్శనమిస్తారు. అజ్ఞానాన్ని పారదోలి, జ్ఞానమనే వెలుగును నింపడమే ఈ వాహనోత్సవ లక్ష్యం.


చంద్రప్రభవాహనం: తొలిరోజు రోజున రాత్రి స్వామి చంద్రప్రభ వాహనంపై గ్రామంలో భక్తులకు దర్శనమిస్తారు. నిర్మలమైన మనస్సును, మనోవికాసాన్ని ఇవ్వడమే ఈ వాహనోత్సవ పరమార్థం.

5వ తేదీ (రెండో రోజు)

గరుడ పుష్పక వాహనం: వేదమూర్తయిన గరుడ స్వామివారి వాహనం. నిత్యం తనను సేవించే గరుడ వాహనంపై అధిరోహించి, స్వామి గ్రామోత్సవానికి తరలివెళతారు.



సూర్యవాహనం (ఫైల్)



చంద్రప్రభ వాహనం (ఫైల్)

పుష్పక వాహనం: తన హృదయమనే పుష్పకంలో ఎంతమంది భక్తులు వచ్చినా చోటు కల్పిస్తానని చాటేందుకు స్వామి పుష్పక వాహనంపై ఊరేగుతారు.

6వ తేదీ (మూడోరోజు)

హంసవాహనం: పరమహంస అయిన తాను మనిషిలోని జ్ఞానజ్ఞాలను వేరు చేసి, జ్ఞానాన్ని ప్రసాదిస్తానని చాటేందుకే ఈ వాహనంపై స్వామి దర్శనమిస్తారు.

శేషవాహనం: శేషుడు వాక్పటిమను కలిగిన వాడు. సర్వవాక్కులకు అధినేతైన వాక్ పరబ్రహ్మను నేనే అని భక్తులకు తెలియజెప్పేందుకే స్వామి ఆదిశేషుడిపై ఊరేగుతారు.

7వ తేదీ (నాల్గవ రోజు)

పంచముఖ ఆంజనేయస్వామి: బుద్ధి, బలం, కీర్తి, ధైర్యం, నిర్భయత్వం అనే గుణాలను భక్తులకు అందించడమే ఈ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం పరమార్థం

కంచుగరుడ వాహనం: కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను జయించే శక్తిని భక్తులకు అనుగ్రహించేందుకు స్వామి ఈ వాహనంపై వెళతారు.

8వ తేదీ (ఐదో రోజు)

రథోత్సవంపై స్వామి రథయాత్ర

9వ తేదీ (ఆరో రోజు)

గజ వాహనం: గజం బుద్ధికి సంకేతం. భక్తుడు బాగా ఆలోచించి, భక్తి, జ్ఞాన, వైరాగ్యాల వైపు భక్తులను నడిపించేందుకు స్వామి ఈ వాహనంపై ఊరేగుతారు.

పొన్న వాహనం: సర్వస్వం నీవే అన్న గోపికల ఆత్మనివేదనను స్వీకరించినట్టుగా భక్తుల ఆత్మనివేదనను స్వీకరించేందుకే ఈ వాహనంపై స్వామి ఊరేగుతారు.

10వ తేదీ (ఏడో రోజు)

హనుమద్వాహనం: భక్తులు కూడా హనుమంతుని వలె స్వామిని తలుచుకుని పనులు నిర్విఘ్నంగా పూర్తి చేయవచ్చని చాటి చెప్పడమే ఈ వాహనం పరమార్థం

సింహవాహనం: మానవుడు, మాధవుడు కలసిన స్వరూపమే లక్ష్మీనృసింహస్వామి. అట్టి మాధవ స్వరూపం, సింహం నేనేనని స్వామి ఈ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు.

11వ తేదీ (ఎనిమిదవ రోజు)

రాజాధిరాజ వాహనం: రాజులకే రాజైన లక్ష్మీనరసింహస్వామి భక్తుల కోర్కెలు తీర్చడానికి ఈ వాహనాన్ని అధిరోహించి, గ్రామోత్సవానికి వెళతారు.

అశ్వ వాహనం: మనిషిలో ఉండే జ్ఞానం అశ్వం మాదిరిగా చురుకుగా ఉండాలని సూచించేందుకు స్వామి ఉత్సవాల్లో ఈ వాహనంపై దర్శనమిస్తారు.

12వ తేదీ (తొమ్మిదో రోజు)

గరుడపుష్పక వాహనంపై గ్రామోత్సవం, చక్రవారి సముద్రస్నానం

13వ తేదీ (పదవ రోజు)

పుష్పక వాహనంపై గ్రామోత్సవం, అంతర్వేది చెరువులో తెప్పోత్సవం

అంతర్వేది తీర్థంలో పటిష్టమైన ఏర్పాట్లు

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రంలో నేటి నుంచి ప్రారంభం కానున్న లక్ష్మీనరసింహస్వామితిరు కల్యాణోత్సవాల్లో పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సోమవారం అంతర్వేది ఆలయం ప్రాంగణంలో ఎమ్మెల్యే మీడియా సమావేశం నిర్వహించారు. గతం కంటే మెరుగైన రీతిలో సౌకర్యాలు కల్పిస్తున్న తరుణంలో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకోవాలని కోరారు. ప్రధాన రోజుల్లో సుమారు 4 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తూ, తదనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రవాణా సౌకర్యాలు మెరుగుపర్చేందుకు ఆర్అండ్‌బీ ద్వారా రూ.22 కోట్లుతో వివిధ రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. పంచాయతీరాజ్ ద్వారా రూ.30 లక్షలతో పనులు చేపట్టామన్నారు. తీర్థంలో పారిశుద్ధ్యంలో 342 మంది కార్మికులు నిమగ్నమవుతున్నారన్నారు. 120 మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేస్తున్నట్టు, 60 సత్తరువులకు తాగునీటి సరఫరా చేసేందుకు అన్ని సిద్ధం చేశామన్నారు. భక్తుల భద్రతకు 20 డ్రోన్‌లు ఫ్లై చేస్తున్నట్టు, 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్టు, 12 ఎల్ఈడీ స్క్రీన్‌లు కల్యాణం వీక్షించేందుకు సిద్ధం చేస్తున్నామన్నారు. అలాగే భక్తుల ఆరోగ్య పరిరక్షణకు 5 ప్రాథమిక కేంద్రాలు, 26 మంది మెడికల్ ఆఫీసర్లు విధుల్లో ఉంటారన్నారు. సమావేశంలో చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, దేవస్థానం ఏసీ వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐదు వేల వాటర్ బాటిళ్ల వితరణ

అంతర్వేది తీర్థమహోత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం సోమవారం సఖినేటిపల్లిలంక గ్రామానికి చెందిన పడాల రాంబాబు ఐదు వేల వాటర్ బాటిళ్లు వితరణ చేశారు. ఈ మేరకు వీటిని ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీకి ఆలయం వద్ద అందజేశారు.